

చందనకు ముస్లిముల సత్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ మండలం, కాతేరులో ముస్లిం బరియల్ గ్రౌండ్ సమస్యను పరిష్కరించిన వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం పెద్దలు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మైనారిటీలను విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్నదే జగనన్న సంకల్పమన్నారు. ముస్లింల కోసం పలు పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత వైసిపి సర్కారుకే దక్కుతుందన్నారు. రూరల్ నియోజకవర్గంలో ముస్లిములకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరుబాట

- విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ప్రారంభం
- పాల్గొన్న ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్
- అడుగడుగునా అపూర్వ స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నడుం బిగించింది. మరో పోరాటానికి సిద్ధమైంది. సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రకు సోమవారం శ్రీకారం చుట్టింది. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ ఈ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థుల నినాదాల మధ్య యాత్రసాగింది. ఎంఎల్‌సి ఐవి స్వయంగా సైకిలును తొక్కి యాత్రకు మద్దతు తెలిపారు.

నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రారంభమైన యాత్ర ట్రైనింగ్ కళాశాల, ఎస్‌కెవిటి పాఠశాల వరకూ సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల సభలను నిర్వహించారు. ఈ సభలో ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ. ఎస్ఎఫ్ఐ పోరాటాల వల్ల కందుకూరి విద్యాసంస్థలను ప్రభుత్వం విలీనం చేసుకుందన్నారు. కందుకూరి ఆస్తులకు, విద్యాసంస్థలకు సంబంధించిన కమర్షియల్ భవనాలను వెంటనే విద్యాసంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నగరంలోని ట్రైనింగ్ కళాశాలకు ఎంతో గుర్తింపు ఉన్నదన్నారు. ఎందరో స్వాతంత్ర్య ఉద్యమకారులు, కళాకారులు, మేధావులు, నాయకులు ఈ కళాశాలలో చదివారన్నారు. వేలాది మందితో కళకళలాడే ట్రైనింగ్ కళాశాలలో సిబ్బంది నియామకాలను ప్రభుత్వం నిలిపేసిందన్నారు. దీంతో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 150కి పడిపోయిందన్నారు. ప్రభుత్వ విధానాలే దీనికి ప్రధాన కారణమన్నారు. వెంటనే సిబ్బందిని నియమించి పూర్వవైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. నేటి సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు జ్ఞానాన్ని సంపాదించాలన్నారు. బట్టీ బట్టీ చదువులు కాకుండా సమాజంలో జరిగే పరిణామాలను పరిశీలించాలని సూచించారు. శాస్త్రీయ విద్య కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత వాదాన్ని పక్కనబెట్టి సమాజ బాధ్యత సమాజ శ్రేయస్సు కోసం అందరూ ఐక్యంగా సాధించు కోవాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేని ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్యను ఎలా అందిస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి రూ.500 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. రూ.18 కోట్లు పెట్టి ఈ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు చదువు అందిస్తున్నామని చెబుతూనే వారికి చదువుని దూరం చేసే విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే విధానాలను మానుకోవాలని, లేకుంటే విద్యార్థులను కలుపుకుని పోరాటానికి దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, ఎన్.రాజా, మాజీ జిల్లా కార్యదర్శి బి.పవన్, జిల్లా సహాయ కార్యదర్శి వై.భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, జోసెఫ్, మహేష్, నగర నాయకులు జ్యోతిర్మయి, రాజేష్, దుర్గ, వైష్ణ, కనక అచ్యుతరావు, భాషా, శశి, వెంకటలక్ష్మి, మరియు, తదితరులు పాల్గొన్నారు.


యాత్రను ప్రారంభిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు


సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్


ఎస్‌కెవిటి పాఠశాలలో జరిగిన సభకు హాజరైన విద్యార్థులు

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు మానవాళిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమల లార్వా నియంత్రణ చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా దోమల నివారణ పై గోడ పత్రికను, కర పత్రాలను కలెక్టర్ మాధవీలత, జెసి తేజ్‌భరత్, డిఆర్ఒ, వైద్యశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పురపాలక, పంచాయతీ అధికారుల సమన్వయంతో దోమల లార్వా నియంత్రణ చర్యలు చేపడుతున్నామన్నారు. దోమల నివారణే లక్ష్యంగా జిల్లాలో వివిధ సంక్షేమ వసతిగృహాల్లో, ఖాళీ ప్రదేశాల్లో ఎసిఎం ద్రవాన్ని పిచికారీ చేయిస్తున్నామన్నారు. 50 వేల 'గంబూషియా' చేపలను హై రిస్క్ ప్రాంతాలల్లో , పెద్ద మొత్తంలో నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో విడిచిపెట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. సీజనల్ మలేరియాకు సంబందించిన యాంటీ మలేరియా మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఉప కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. జ్వరంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి మలేరియా నిర్ధారణ పరీక్షలు జరిపి మందులు అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని, పడుకునేటప్పుడు దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. కీటకనాశిని మందు పిచికారీ తప్పనిసరిగా చేయుంచడం జరుగుతుందన్నారు. పిల్లల చేతులకు, కాళ్లకు నిండుగా ఉండే దుస్తులు వేయాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతుంటే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిని సంప్రదించాలన్నారు. డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2020 సంవత్సరం నుంచి తూర్పు గోదావరి జిల్లాలో మలేరియా జ్వరాలు తగ్గుతూ వస్తున్నాయన్నారు. 2020లో 9 కేసులు, 2021లో 3 కేసులు, 2022లో 2 కేసులు, 2023లో ఇంతవరకు 4 మలేరియా కేసులు నమోదయ్యాయన్నారు. డెంగీ కేసులు 2020లో 11, 2021లో 199, 2022లో 226, 2023లో ఇంతవరకు 33 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియాకు, డెంగీ నిర్ధారణ పరీక్ష కిట్లు, మందులు అందుబాటులో ఉంచి రోగులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెసి ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ జి.నరసింహులు, జిల్లా అధికారులు, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడు ప్రసాద్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - చాగల్లు

పోలీసుల చిత్రహింసలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత యువకుడు వడ్డి వెంకటప్రసాద్‌ను, అతని కుటుంబాన్ని పలువురు సోమవారం పరామర్శించారు. జిల్లా దళిత గిరిజన సంఘాల జెసిసి నాయకులు ఈ ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు కోరుకొండ చిరంజీవి మాట్లాడారు. ఎస్ఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటూ స్టేషన్ బెయిల్ ఇవ్వరాదన్నారు. బాధితుడికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో నాయకులు జువ్వల రాంబాబు, బొంతా శ్యామ్‌ప్రకాష్, దువ్వాడ రాజా, వెంకట ప్రసాద్, శిరీష, దుర్గారావు తదితరులున్నారు.

ప్రత్యేక హోదాపై నోరు విప్పాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి, జనసేనలు ప్రత్యేక హోదాపై నోరు విప్పాలని, ఆ పార్టీలు క్షేత్రస్థాయిలో పోరాటం సాగిస్తే ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. 'రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి' పేరుతో సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర సోమవారం కాకినాడ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో సాగింది. రాజమహేంద్రవరంలో యాత్రకు ఘనస్వాగతం లభించింది. కోటిపల్లి బస్టాండ్ వద్ద సిపిఐ నాయకులు తాటిపాక మధు అధ్యక్షతన గోదావరి గర్జన పేర బహిరంగ సభను నిర్వహించారు. తొలుత యాత్రలో భాగంగా కాకినాడలోని గాంధీ భవన్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు శ్రీనివాసరావు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సిపిఎం నాయకులు దువ్వా శేషబాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రధాన పార్టీలు ప్రత్యేక హోదా, విభజన హామీలపై నోరు విప్పట్లేదన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వ మెడలు వంచేందుకు సరైన సమయం ఆసన్నమైందన్నారు. ప్రత్యేక హోదాపై పోరాటం చేస్తే కచ్చితంగా సాధిస్తామని తెలిపారు. మోడీ పాలన దేనశానికి అరిష్టంగా మారిందన్నారు. మోడీ


యాత్రకు స్వాగతం పలుకుతున్న సిపిఐ నాయకులు

తొమ్మిదేళ్ల పాలనలో రూ.100 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. కార్పొరేట్ల కోసమే మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మణిపూర్ ఘటనే దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో పోలీసుల నియంత పాలన సాగుతుందన్నారు. దళితులను పోలీసులు కొట్టి మూత్రం తాగించడమంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి భద్రత ఉంటుందన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ విధానాల వల్ల అన్ని ధరలూ ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, ఎఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాజేంద్ర బాబు, లెనిన్ బాబు, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు చందర్ నాయక్ పెంచలయ్య, మహిళా సమైక్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విమల, ఎఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాడు అక్రమం... నేడు సక్రమం?

చిత్రం : 1


2017 డిసెంబర్ 17న అక్రమ కట్టడం అంటూ కూల్చేసిన భవన నిర్మాణం

చిత్రం : 2


నేడు అదే ప్రాంతంలో దేవాలయం పేర అక్రమార్కులు నిర్మించిన పక్కా భవనం

పక్కన కనిపిస్తున్న మొదటి చిత్రం 2017 డిసెంబర్ 17 నాటిది. ధవళేశ్వరం బ్యారేజీ క్వార్టర్లను పడగొట్టి మరీ నిర్మాణం చేపట్టడంతో అప్పటి ఇరిగేషన్ శాఖలో ఆర్ అండ్ బి అధికారులు యంత్రాలతో ఇలా కూల్చేశారు. రెండోది సోమవారం తీసిన తాజా చిత్రం. గతంలో అక్రమ నిర్మాణం చేపట్టిన ప్రాంతంలోనే నిర్మించిన పక్కా భవనం. కొంత మంది ఇరిగేషన్ అధికారుల అండదండలతోనే ఈ భవనాన్ని నిర్మించారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఇరిగేషన్ స్థలంలో ఒక పాడిరైతు వేసుకున్న పాకను పీకేసిన అధికారులకు ఈ పక్కాభవనం కనిపించకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. కూల్చేసిన స్థలంలోనే పక్కాభవనాన్ని నిర్మించడం వెనుక ఆంతర్యం ఏమిటో సదరు అధికారులే ఎరుక..!

:: ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్ ::

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి మంజూరైన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా దళితవాడలో సిసి రోడ్డు పనులను నిర్వహిస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు సోమవారం పరిశీలించారు. ఆయన వెంట ఉపసర్పంచ్ మదన్ మోహన్, కార్యదర్శి డిఎస్‌సి.శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ పాలొన్నారు. ఇదిలా ఉంటే మిగిలిన గ్రామాలలో కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్, యూనియన్ నాయకులు గుంటూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఎపి స్కూల్ స్వీపర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతిపత్రం అందించారు. గతంలో ఉన్న 19 నెలల వేతనం బకాయిలను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. పలు దఫాలుగా అధికారులకు సమస్య విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. నాడు-నేడు పేరుతో బడుల ఆధునీకీకరణ జరిగిందని అయితే అదే సందర్భంలో పెరిగిన పని భారానికి అనుగుణంగా వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్య సంవత్సరం మే జూన్ నెలలో పూర్తి కాలం పని చేయించుకుని సగం వేతనం మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. పనిచేసే ప్రదేశంలో కావాల్సిన పరికరాలు వస్తువులు సౌకర్యాలు అందుబాటులో ఉండటం లేదని ఫలితంగా స్వీపర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, సిఐటియు నాయకులు కె.రత్నాజీ, షేక్ హమీంబి, మహ్మద్ రంజాని, టి.ధనలక్ష్మి, కె.రమ్య తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాయల్ హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ బిందు అన్నారు. రాజమండ్రి రూరల్ మండలంలోని కాతేరు పాత పంచాయతీ అవరణలో కాతేరు యూత్ సర్కిల్ సహకారంతో రాయల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. 200 మందికి పైగా రోగులను పలువురు వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్స్ అవసరమైన వారిని హాస్పిటల్‌కి రిఫర్ చేశారు. ఈ వైద్య శిబిరంలో రాయల్ హాస్పిటల్ వైద్యులు శివ, బిందు, సిబ్బంది పాల్గొన్నారని క్యాంపు కో-ఆర్డినేటర్ కె.వెంకట్ తెలిపారు.

మానవతా ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ...

ప్రజాశక్తి - తాళ్లపూడి, గోపాలపురం

సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతిలో భాగస్వాములు కావాలని మానవతా సేవా సంస్థ మండల శాఖ గౌరవాధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు అన్నారు. మండల మానవతా శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడి, గోపాలపురంలో సోమవారం శాంతి ర్యాలీలు నిర్వహించారు. తాళ్లపూడిలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో సాయన సుబ్బారావు, టి.దోసాలు, వి.చంద్రయ్య, జి.బాబులు, టిఎన్‌బి.గుప్త, హెచ్ఎం సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. గోపాలపురంలో పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. చెక్‌పోస్ట్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఎఎస్ఐ శోభనాద్రి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాంతి మార్గంలో పయనించాలన్నారు.

రాష్ట్ర మహాసభకు తరలిన ఎన్‌జిఓలు

ప్రజాశక్తి - తాళ్లపూడి


విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఎన్‌జిఒ రాష్ట్ర మహాసభకు గోపాలపురం తాలూకా యూనిట్ నుంచి 20 మంది ఉద్యోగులు వెళ్లారని జెఎసి చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఉద్యోగుల బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెఎసి కార్యదర్శి ఎస్.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వీర్రాజు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు

ప్రజాశక్తి- గోకవరం

సేంద్రియ సాగు వల్ల రైతులకు లాభాలు చేకూరుతాయనిజిల్లా ప్రకతి వ్యవసాయం శాఖా అధికారి షేక్ మహబూబ్‌అలీ అన్నారు సోమవారం గోకవరం వెలుగు కార్యాలయంలో ఎపిఎం సునీత ఆధ్వర్యంలో విఓఎలు, ఐసిఆర్‌పిలకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై గోకవరం మండలంలో ఉన్న రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రకృతి సేంద్రియ పద్ధతిలో పంటలకు పండిస్తే మేలురకమైన ఉత్పత్తులు వస్తాయన్నారు. తద్వారా అధిక లాభాలను పొందొచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులు సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలన్నారు. దీనిలో భాగంగానే సోమవారం సేంద్రియ సాగుపై వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం బి.తాతారావు, విఓఎలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



దళితులకు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దళితులు

పెరవలి మండలం అన్నవరప్పాడులో దళితులకు న్యాయం చేయాలని నగరంలోని కలెక్టరేట్ వద్ద సిపిఎం, దళిత సంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జెసికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు. అన్నవరప్పాడులో కొంతమంది వైసిపి నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై జగనన్న ఇళ్ళ స్థలాలకు సంబంధించి అవినీతికి పాల్పడ్డారన్నారు. దళితులకు శ్మశాన వాటికకు దగ్గర స్థలాలు కేటాయించి ఒసి, బిసిలకు జాతీయ రహదారి చెంత కేటాయిస్తూ వివక్షకు గురిచేశారన్నారు. దళితులకు ఇచ్చిన స్థలానికి దారి లేకుండా చేశారన్నారు. ఒసి బిసిలకు గ్రామ కంఠం భూమిని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించారన్నారు. 60 ఏళ్లుగా దళితవాడ పక్కనే ఉన్న గ్రామ కంఠం భూమిని దళితుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించకుండా లే-అవుట్ చేసి అమ్ముకున్నారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన అధికారులు, వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన జెసి కొవ్వూరు ఆర్‌డిఒను దీనిపై విచారణకు నియమించారు. ఈ కార్యక్రమంలో కొండేటి శ్రీను, వి.దొరబాబు, గంధం.మేరీ, రాయి సువార్త, దొండపాటి బేబీ, వి.చిన్నారి, మారమ్మ. సుగుణ, చిరంజీవి, వి.శ్రీను, జి.అనిల్, కె.భూషణం, ఎం.కాశీ తదితరులు పాల్గొన్నారు

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

ఉండ్రాజవరం : మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానికి జరిమానా విధిస్తామని ఎస్ఐ కె.రామారావు హెచ్చరించారు. సోమవారం ఉండ్రాజవరం ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేని పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పుడూ వెంట పెట్టుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలన్నారు. వాహనదారులందరూ తప్పనిసరిగా వాహన నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.రమేష్‌బాబు, వి.త్రినాథ్, జె.వెంకటేష్, ఎం.మణికంఠ పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

గోపాలపురం : గోపాలపురం వర్తక సంఘం ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. రాజమహేంద్రవరం డెల్టా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వర్తక సంఘం సభ్యులు మాట్లాడుతూ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామన్నారు. డెల్టా హాస్పిటల్ వైద్యులు జయరాజు, దుర్గాప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ నాగేంద్ర, జిఎం ఆర్.క్రాంతికుమార్ సిబ్బంది, వర్తక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వెలగదుర్రులో మినీ మేనిఫెస్టోపై ప్రచారం

ఉండ్రాజవరం : టిడిపి మినీ మేనిఫెస్టో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన 'మహాశక్తి' పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం సోమవారం వెలగధుర్రులో టిడిపి నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు నల్లూరి పుష్పవతి, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


బోల్తా పడిన లారీ

లారీ బైకు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి -గోకవరం

లారీ బైకు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన తిరుమలాపాలెంలో సోమవారం చోటు చేసుకుంది స్థానికుల కథనం ప్రకారం గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామ శివారున కవస లారీ, బైకు ఢీకొనడంతో బైకుపై వెలుతున్న సామర్లకోటకు చెందిన గుకొల్లపు శ్రీను (30) మిరియాల నాగు(29) అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట కెనాల్ రోడ్డులో సోమవారం వేట్లపాలెం సమీపాన రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వేట్లపాలెం వైపు నుంచి మేడపాడు వస్తున్న బైక్, ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్న ఈ ఘటనలో మేడపాడుకు చెందిన గరికపాటి జితేంద్రసాయి, కొంకుదురు గ్రామానికి చెందిన భార్యాభర్తలు పులి శ్రీను, దేవి గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు 108 అంబులెన్స్ లో సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

సివిల్ సప్లై గొడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం సివిల్ సప్లై గొడౌన్లో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ అధికారులు సిఐ శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దారు విజయ్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా కందిపప్పు, పంచదార, రేషన్ బియ్యం, పామాయిల్ నూనెతో పాటు వివిధ తనిఖీల్లో అక్రమంగ తరలించే క్రమంలో సీజ్ చేసి భద్రపరిచిన పిడిఎస్ రైసులో తేడాలు గుర్తించేందుకు సమగ్రంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనికీల్లో 150 కేజీల బియ్యం, 70 కేజీల కందిపప్పు లెక్కల ప్రకారం స్వల్ప తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీనిపై సివిల్ సప్లై డిమ్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో హెచ్‌సి జీవానందం, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్చార్జ్ (డి.టి) వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ లోవ కుమార్ పాల్గొన్నారు.


అన్నదానంలోపాల్గొన్న జ్యోతుల నెహ్రూ

పేదల ఆకలి తీర్చడమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి-జగ్గంపేట

పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినట్టు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్‌టిఆర్ స్మారకమందిరం కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుంచి సంతకు వచ్చే పేదలకు బూరుగుపూడికి చెందిన కుంచె సీతారామయ్య ఆర్థిక సాయంతో అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పల రాజు, మారి శెట్టి భద్రం, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు రాజపూడి బుల్లబ్బు చౌదరి, రాజు, రేణు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


మట్టి తవ్వేసిన సాగునీటిచెరువు

సాగునీటి చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-జగ్గంపేట రూరల్

భావరంలో అక్రమంగా సాగునీటి చెరువుల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామంలో కొంతమంది కబ్జాదారులు ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భావరం గ్రామ పరిధిలో ఉన్న కోనేటి వారి సాగునీటి చెరువులో వారం రోజులుగా మట్టిని అక్రమంగా తరలించుకు పోతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రైతులు నాగం విష్ణుమూర్తి, పదిలం బుచ్చిబాబులు మాట్లాడుతూ కోనేటివారి చెరువు వ్యవసాయం సాగుకు భయపడేదని అటువంటి చెరువులో మట్టిని జెసిబిల సాయంతో లారీల్లో తరలించకపోతున్నారన్నారు. గతంలో అధికారికంగా అనుమతులు తీసుకొచ్చామంటూ తప్పుడు పత్రాలు చూపించారన్నారు. అక్రమంగా మట్టిని తవ్వుతున్నారని వారిని అడ్డుకుంటే మాపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. ఇక తాము చేసేదిలేక ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అక్రమ తవ్వకాలు నిలిపివేసి వ్యవసాయ సాగు నీటికి ఉపయోగపడేలా చెరువులను అభివృద్ధి చేయాలని రైతుల కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారి టి శేషగిరి రావు ను వివరణ కోరగా సంఘనా స్థలానికి వచ్చి కోనేటివారి చెరువులు పరిశీలించామన్నారు. ఈ విషయమై అధికారికంగా పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు అన్నారు.

పాత పెన్షన్ విధానం కోసం ధర్నా


ధర్నా చేస్తున్న రైల్వే కార్మికులు ఉద్యోగులు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

రైల్వే ఉద్యోగులకు సిబ్బందికి 2004 నుండి అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సామర్లకోట సీనియర్ రైల్వే సెక్షన్ ఇంజనీర్, పబ్లిక్ వే కార్యాలయం వద్ద రైల్వే కార్మికుల ఉద్యోగులు ధర్నా ఆందోళన నిర్వహించారు. తక్షణమే నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని కోరుతూ రైల్వే ఎంప్లాయిస్ రైల్వే మజ్దూర్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తప్పుల తడకలుగా ఉన్న నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని తక్షణమే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు రైల్వే యూనియన్ నాయకులు, రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలపై భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని డిసిఎల్ కార్యాలయం వద్ద సోమవారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1996లో కేంద్ర ప్రభుత్వం బిఒసి చట్టం చేసి, బోర్డును ఏర్పాటు చేసిందని, ఎపిలో 2009లో ఈ బోర్డు ఏర్పడిందని చెప్పారు. 2014 వరకు సంక్షేమ పథకాలు కార్మికుల అందుకున్నారన్నారు. ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం, ఈనాటి జగన్ ప్రభుత్వం రూ.1700 కోట్ల బోర్డు నిధులను పక్కదారి పట్టించారన్నారు. బోర్డులో నిదులను వాడుకునే హక్కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని, వాడుకున్న ప్రభుత్వాలు బోర్డుకి జమ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు. గంటా బేతాళుడు, చవ్వాకుల రాఘవ, బండారి బాబురావు, అడపా వీరభద్రరావు, మల్లవరపు రాజు, శ్రీపాదం సత్తిబాబు, వీర్రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

పైడాలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పటవలలోని పైడా గ్రూపు విద్యాసంస్థల ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థల ఆధ్యర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, ప్రెసిడెంట్ బాదం బాలకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రవమంలో విద్యాసంస్థల డీన్ డాక్టర్ వీరభద్రరావు స్వాగత ఉపన్యాసం చేశారు. స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా బాదం బాలకృష్ణ మాట్లాడుతూ 38 సంవత్సరాలుగా 87 సార్లు రక్తదానం చేశారని చెప్పారు. విద్యార్థులు ఈ వయసులో రక్తదానం చేయడం ప్రారంభిస్తే తప్పకుండా 100 సార్లు చేసి 100 మందికి ప్రాణదానం చేసి జీవితాలను కాపాడిన వారవుతార న్నారు. ఈ సందర్భంగా 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యాసంస్థల డిప్యూటీ డైరెక్టర్. రవీంద్రారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిబీల్ సురేష్, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ నాయుడు, అధ్యాపకులు రమేష్, సుమ తదితరులు పాల్గొన్నారు


మహాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

టిడిపి పాలనలోనే రాష్ట్ర పురోభివృద్ధి

ప్రజాశక్తి - పెద్దాపురం

తెలుగుదేశం పార్టీ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధిస్తుందని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక 3వ వార్డు పరిధిలో సోమవారం జరిగిన మహాశక్తి సభలో ఆయన ప్రసంగించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టిడిపి అధినేత చంద్రబాబు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ఈ సభలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, రంది సత్యనారాయణ, తూతిక రాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), ఎలిశెట్టి నాని, కందుల విశ్వేశ్వరరావు, మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ఐడియల్ కళాశాల వద్ద బస్ షెల్టర్ నిర్మించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఐడియల్ కళాశాల ఎదురుగా బస్సు సెంటర్ నిర్మించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం ఎస్ఎఫ్ఐ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, నగర నాయకులు సాహిత్, వాసు సంయుక్తంగా మాట్లాడుతూ కాకినాడ నుంచి రాజమండ్రి వయా సామర్లకోట, పెద్దాపురం, ఏలేశ్వరం గోకవరం మీదుగా వెళ్లే ప్రయాణికుల కోసం ఐడియల్ కాలేజీ ఎదురుగా ఆర్‌టిసి బస్ స్టాప్ ఏర్పాటు చేసిందని, కానీ అక్కడ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు విద్యార్థులు ఆరుబయటే నిలబడి ఎండకు, వానకు తీవ్ర అసౌకర్యానికి గురవ్వాల్సి వస్తోందన్నారు.

రైలు టిక్కెట్ రాయితీ పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు నిలిపివేసిన రైల్వే టికెట్‌లలో రాయితీలను పునరుద్ధరించాలని వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక రామారావు పేటలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల గౌరవంతో మెలగాలన్నారు. వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి కె.పుష్పాంజలి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సేవలను గుర్తించి ఆసుపత్రుల్లో వారికి అందించే వైద్య సేవలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబ సభ్యులు తమ కుటుంబంలోని వృద్ధుల పట్ల మానవత్వంతో మెలగాలన్నారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి ఎం.భాస్కర్‌రావు, కె.సుధాకర్, టి.సత్యనారాయణ, బి.నాగ కుమారి, వి.శ్యామల ప్రసంగించారు.

యానాం వార్తలు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో జరిగిన భారీ బహిరంగ సభకు యానాం నుంచి పుదుచ్చేరికి ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లి అక్కడ పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ వైద్యలింగం, మాజీ సీఎం నారాయణసామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్లాడి సత్తిబాబు, అర్థాని దినేష్, మల్లాడి వీరాస్వామి, దున్నా చక్రవర్తి, లంకే నాగూర్, అంజియ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

26న అన్ని పాఠశాలలకూ సెలవు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పాలనాసంస్కరణల విభాగం ఈ నెల 27న 165 ఎల్‌డిసి, 55 స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి యానాంలో పది పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో పరీక్షకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను నిర్వహించడానికి ఈ నెల 26 శనివారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ ఎడ్యుకేషన్ జెడి పిజి శివగామి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల అధిపతులు సాయం అందించాలన్నారు.

యానాంలో యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణ పరిధిలో ఒక యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యుకెవి నగర్‌కు చెందిన మీసాల మౌనిక (22) తన స్వగృహంలో ఫ్యాన్‌కు చున్నీ బిగించి బలవన్మరణానికి పాల్పడిందన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు గమనించి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చినప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు కారణాలపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శేరు నూకరాజు తెలిపారు.


వృద్ధులను సత్కరిస్తున్న సభ్యులు

వృద్ధుల సంరక్షణ పిల్లల నైతిక బాధ్యత

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వృద్ధులు ఆరోగ్యంగా, సంతోషంగా, గౌరవప్రదంగా జీవించే విధంగా చూడాల్సిన నైతిక బాధ్యత పిల్లల దేనిని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు పెన్షన్లు ఇతరులకు ఆదాయ పన్ను రాయితీలు లభిస్తున్నా రైల్వేలో మాత్రం గతంలో ఉన్న రాయితీలను తొలగించడం బాధాకరం అన్నారు. ప్రతి ఐదుగురిలో ఒకరు ఒంటరిగా జీవిస్తుంటే, ప్రతి ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురవుతున్నారన్నారు. కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారని అన్నారు. వద్ధులు దూషణలతోపాటు శారీరిక హింసకు కూడా గురువుతున్నారని అన్నారు. నేడు మన దేశ జనాభాలో 11 శాతం మంది వృద్ధులు ఉన్నా సంరక్షణ లేదన్నారు. పాశ్చాత్య దేశాలు వద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు అమలు చేస్తున్నాయన్నారు. ఆర్థిక భద్రతను కూడా కల్పిస్తున్నాయని అన్నారు. వృద్ధులకు ఏమైనా సమస్యలు వస్తే జాతీయ హెల్ప్ లైన్ 14567కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవరావు, రాజా, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

సర్పంచ్ భర్త పెత్తనంపై సభ్యుల నిరసన

ప్రజాశక్తి-కరప

పెనుగుదురు పంచాయతీ సర్వసభ్య సమావేశంలో భర్త పెత్తనంపై వార్డు సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశానికి మహిళ సర్పంచ్ అయిన రెడ్డిపల్లి మాధవి స్థానంలో ఆమె భర్త రమేష్ హాజరు కావడంపై గ్రామస్తులు, వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శి సైతం సర్పంచ్ భర్తకు వంత పాడుతూ మీడియా వాళ్లు ఎందుకు వచ్చారంటూ మీడియా పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా వాళ్ళ గుర్తింపు కార్డు లు చూపించి పంచాయతీ లోకి రావాలి అని షరతులు పెట్టారు. మీడియా వాళ్లు కార్యాలయంలోకి రాగానే వారిని చూసి సర్పంచ్ భర్త బయటకి వెళ్లిపోయారు. సర్వసభ్య సమావేశానికి పంచాయతీ మెంబర్లు కాకుండా వైసిపి నాయకులు హాజరవడం, పంచాయతీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు కాకుండా వైసిపి నాయకులు సమాధానాలు చెప్పడంపై జనసేన వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బండారు మురళి మాట్లాడుతూ గ్రామ అభివద్ధికి ప్రజలు ఎదుర్కొంట సమస్యలకు వార్డు నంబర్లు అడిగిన ప్రశ్నలకు అధికారులు సర్పంచ్ సమాధానం చెప్పకుండా బయట వైసిపి నాయకులు కలగజేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వలసపాకలలో గ్రామసభ జరపాలని వినతి

ప్రజాశక్తి-కాకినాడరూరల్

వలసపాకల,వాకలపూడి రెండు గ్రామాలకు సంబంధించిన కోరమండల్ ఇంటర్నేషనల్ టెర్మినల్ లిమిటెడ్ పరిశ్రమ, పరిశ్రమవిస్తరణకు సంబంధించి కె.సత్యనారాయణరావు, పి.వీర కుమార్ వినతిపత్రాన్ని సెక్రెటరీ, స్పెషల్ ఆఫీసర్‌కు అందజేశాఇరు.

అనంతరం మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ తక్షణమే వలస పాకల గ్రామపంచాయతీ పరిధిలో నివసిస్తున్న ప్రజలందరికీ గ్రామ సభ జరపాలన్నారు. ప్రజలకు జవాబు దారిగా ఉండాలని కోరారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ టెర్మినల్ లిమిటెడ్ ప్లాంట్ విస్తరణ 19 ఎకరాల్లో రూ.710 కోట్ల వ్యయంతో ఒకటి కొత్త నానో ఎరువులు, నానో యూరియా లేదా నానో డిఎపి అభివృద్ధి చేస్తారని, మరొక పరిశ్రమ బొగ్గు ఆధారిత పవర్ ప్లాంటు అభివద్ధి కూడా జరుగుతుందని అన్నారు. ఈ రెండు ప్లాంట్ల వల్ల వాకలపూడి వలస పాకల చుట్టుపక్కల గ్రామ ప్రజలు అనారోగ్య సమస్యలతో అనేక ఇబ్బందులు పడతారన్నారు.

ఈ పరిశ్రమల వల్ల కెమికల్, బొగ్గు, ధూళి వలన విషం చిమ్ముతుందని అన్నారు. ఇప్పటికే సముద్రపు లో చేపలు, వ్యవసాయం దెబ్బతిన్నాయి. ఇప్పటికే సూర్యరావుపేటలో పరిశ్రమల వల్ల చుట్టుపక్కల కాల్షియం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వలస పాకల గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని, భవిష్యత్తు తరాల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే వలస పాకల గ్రామంలో దండోర వేయించి గ్రామ సభ వలస పాకుల పంచాయతీలో వాచ్ పార్టీ చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

'మహాశక్తి'తో మహిళలకు ఉజ్వల భవిత

ప్రజాశక్తి-పెదపూడి

అన్ని రంగాల్లో మహిళలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలని టిడిపి అధినేత చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో మహాశక్తి పథకాలు ప్రకటించారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జుత్తుక సూర్యకుమారి అధ్యక్షతన మండలంలో కుమార ప్రియం గ్రామంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్ళి టిడిపి మేనిఫేస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ సంక్షేమం పేరుతో దోపిడీ చేస్తోందని ఆరోపించారు. అసలైన సంక్షేమం టిడిపితోనే సాధ్యమని వెల్లడించారు. ప్రత్యేకించి మహిళలకు మహాశక్తి పేరుతో అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వంలో ధరలు రోజురోజుకీ పెరుగుతున్నా ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం అన్నారు. వచ్చే ఎన్నికలలో వైసిపికి తగిన గుణపాఠం చెప్పి టిడిపికి విజయం చేకూర్చి చంద్రబాబును ముఖ్య మంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి బేరా వేణమ్మ, తూర్పుగోదావరి జిల్లా మహిళా అధ్యక్షులు శేషారత్నం, పెదపూడి మండల అధ్యక్షురాలు సత్యవతి, రాష్ట్ర డ్వాక్రా, అంగన్వాడీ సాధికారిక కమిటీ ఉపాధ్యక్షురాలు సుభాషిణి, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా గంగాధర చౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు జుత్తుక కృష్ణ, , టీడీపీ నాయకులు శారద, తూర్పుగోదావరి జిల్లా కోశాధికారి సానా శ్రీను పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

C-FORM LOST

We hereby state that the following **C-Form No.CE/AP 9191815, dt.14-10-2015 for an amount of Rs.6,75,750/-** issued by **M/s. CSR IMPEX PVT. LTD.**, in the name of the **MANICHANDRA ENTERPRISES** was lost somewhere in the jurisdiction of Kakinada while travelling from Kondayyapalem to Jagannaickpur, Kakinada Urban on 24-07-2023, and it was not traceable. If found kindly inform the same to

MANICHANDRA ENTERPRISES
#25-6-6/2, Ganjamvari Street,
Kakinada - 533 001

పేరు మార్పు

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అంబాజీపేట మండలం, ఇసుకపూడి, తురకలదొడ్డి, డోర్ నెం. 1-100/2 కి చెందిన విత్తనాల శ్రీనివాసరావు, S/o. వెంకట్రావు అను నా యొక్క పాస్‌పోర్టులో నా తండ్రి గారి పేరు **విత్తనాల వెంకట్రావు** బదులుగా విత్తనాల చిన నర్సన్న అని పొరపాటున వచ్చింది. నా తండ్రి అసలు పేరు **విత్తనాల వెంకట్రావు.** ఇక నుండి ఈ పేరుతో పిలువబడుతుంది తెలియపరచుచున్నాము.

విత్తనాల శ్రీనివాసరావు
S/o. వెంకట్రావు
ఇసుకపూడి, అంబాజీపేట మండలం
సెల్: 9121752623

దస్తావేజులు పోయినవి

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం, ఆలమూరు గ్రామ కాపురస్తులు డోర్ నెం. 3-105 కాపురస్తులు రచ్చా మహాలక్ష్మి గారి కుమారుడు రాధాకృష్ణ, వయస్సు 37 సం॥లు అను వారికి వారి తండ్రి గారు అయిన రచ్చా మహాలక్ష్మి గారు ది. 17-7-2008 సం॥ తేదీన శ్రీ ఆలమూరు సబ్-రిజిస్ట్రారు వారి కార్యాలయములో దస్తావేజు నెంబరు 1345/2008 గా రిజిష్టరు కాబడిన దానపట్టా దస్తావేజు ది. 1-8-2008 సం॥ తేదీన ఆలమూరు గ్రామంలోని ఇంటి వద్ద నుండి జిరాక్సు తీయించుకొను నిమిత్తం మోటారు సైకిల్‌పై వెళ్ళుచుండగా పడిపోయినది. కావున అవి దొరికినచో దొరికినవారు ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయవలెను.

రచ్చా రాధాకృష్ణ, S/o. మహాలక్ష్మి
డోర్ నెం. 3-105, ఆలమూరు
ఆలమూరు మండలం, సెల్: 9247203999

మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించిన అటవీ అధికారులు

ప్రజాశక్తి-రౌతులపూడి

అనకాపల్లి జిల్లా బామిడికలోదు లో గల మైనింగ్ ప్రాంతాన్ని అటవీ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. సిసిఎఫ్ సర్వనన్, రాజహేంద్రవరం డిఎఫ్ఒ ఎంవి. ప్రసాద్, ఎఫ్ఆర్ఓ దుర్గా రాంప్రసాద్, ఎఫ్ఎస్ఒ నాగేశ్వరరావు తదితరుల బందం సరుగుడు లెటర్ రైట్ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు ఈ లెటర్ తవ్వకాలపై ఇటీవల ఎన్‌జిటికి ఫిర్యాదు చేయడంతో సోమవారం పరిశీలించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

'స్పందన'కు 3 అర్జీలు

ప్రజాశక్తి- రామచంద్రపురం

ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమం లో 3 అర్జీలు వచ్చాయని కార్యాలయం అధికారులు తెలిపారు. వాటిలో వికలాంగుల పెన్షన్ (రూ.5వేలు) మంజూరు చేయాలని, ఆక్రమణ తొలగించాలని, మురుగు నీరు పోవుటకు మార్గము కల్పించాలని అర్జీలు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమం లో ఆర్‌డిఒ పి.సింధు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అండాశయంలో కంతి తొలగింపు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం కిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం ఒక బాలికకు అండాశయంలో కంతిని శస్త్రచికిత్స చేసి తొలగించారు. వివరాలు ఇవి.. మల్కిపురం కి చెందిన 12 సంవత్సరముల బాలిక కడుపు నొప్పి, వాంతులు సమస్యతో కిమ్స్ హాస్పిటల్ అత్యవసర వైద్య సేవల విభాగానికి వచ్చారు. ఆమెకు పరీక్షలు స్కానింగ్ చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్ వరద, ఆ బాలిక అండా శయంలో సుమారు 17 సెం.మీ. వ్యాసం ఉన్న కంతి మెలికలు తిరిగి ఉన్నట్లు గమనించారు. సర్జరీ చేసి కంతి తొలగించాలన్నారు. సర్జరీ కొరకు అవసరమైన పరీక్షలు చేసిన తరువాత గైనకాల జిస్టులు డాక్టర్ వరద, డాక్టర్ మానస మత్తు వైద్యులు డాక్టర్ సౌమ్య లతో కూడిన వైద్య బృందం ఆ బాలికకు 'ఎక్సప్లోరేటరీ లాప్రోటమి' సర్జరీ చేసి సుమారు ఒక కిలో బరువు గల అండాశయ కంతిని విజయ వంతంగా తొలగించారు. సర్జరీ తరువాత ఆ బాలిక కోలుకుంటోందని, మూడు రోజుల వైద్య పర్యవేక్షణ అనంతరం ఇంటికి పంపుతారని గైనకా లజిస్ట్ డాక్టర్ వరద తెలిపారు. క్లిష్టమైన సర్జరీ ద్వారా కంతిని తొలగించిన వైద్య బందాన్ని కిమ్స్ చైర్మన్ కెవివి.సత్య నారాయణ రాజు, ఎండి రవి కిరణ్ వర్మ, కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య అభినందించారు. డాక్టర్ వరద మాట్లాడుతూ చాల మంది స్త్రీలు అవగా హనా లోపం వల్ల ఇటువంటి సమస్యలకు గురవుతు న్నారని, అశ్రద్ధ చేయ కుండా డాక్టర్‌ను సంప్ర దించి తగిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా తొలి దశలో తెలుసు కొని చికిత్స చేయించుకునే అవకాశం ఉందన్నారు.